నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శుక్రవారం | జూన్ 21, 2024 | www.navatelangana.com

శ్రావణపల్లి గనిని సింగరేణికే కేటాయించాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

శ్రావణపల్లి బొగ్గు గనిని సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) బ్రాంచ్ అధ్యక్షులు వెంకటస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలోని 60 బొగ్గు బావులను వేలం వేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అందులో తెలంగాణలోని శ్రావణపల్లి గనిని కూడా వేలం వేసే విధంగా ప్రయత్నాలు చేస్తోందన్నారు. దీనికి సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలుపుతున్నట్లు సింగరేణి కార్మికులకు అనుమానం కలుగుతోందని తెలిపారు. బొగ్గు బావులను వేలం వేయకుండా, ప్రయివేట్‌పరం కాకుండా చూడాలని, సింగరేణిలో 51:49 శాతం వాటాదారులుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వేలం పాటలో శ్రావణపల్లి గని సింగరేణికి కేటాయించే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కలిసి తెలంగాణలో కొత్త బొగ్గు బావులను తీసుకురావాలని, లేకపోతే అన్ని యూనియన్లను కలుపుకొని పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కారు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సమీపంలో గురువారం కారు ఢీకొని వృద్ధునికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రజనిష్ కారును అజాగ్రత్తగా నడపడం వల్ల టీవీఎస్ ఎక్సెల్‌పై అటుగా వెళుతున్న ఆగుట్ల నర్సయ్యను బలంగా ఢీకొనడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో వృద్ధుని కాలు రెండు ముక్కలుగా విరిగింది. దీంతో ఘటన స్థలం నుంచి వృద్ధున్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కారును అజాగ్రత్తగా నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ధరణి దరఖాస్తుల ప్రక్షాళన..!

- పెండింగ్ ఆర్జీలపై రెవెన్యూ యంత్రాంగం దృష్టి
- క్షేత్ర స్థాయిలో పరిశీలన..కలెక్టర్‌కు నివేదిక
- పరిష్కారం దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభం
- ఈ నెలాఖరులో పూర్తిచేసేందుకు ప్రణాళిక

అన్నదాతలను అవస్థలకు గురిచేస్తున్న ధరణి దరఖాస్తుల ప్రక్షాళనకు నూతన ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏండ్లుగా పరిష్కారానికి నోచుకోకుండా అస్తవ్యస్తంగా ఉన్న మాడ్యూల్స్‌ను సక్రమం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు వచ్చిన ఆర్జీల్లో అనేకం వాటికి పరిష్కారం లభించకపోవడంతో అన్నదాతలు కలెక్టరేట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలోనే ఈ సమస్య ఉత్పన్నం కాగా.. వీటి పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టినా అంతగా ఫలితం కనిపించలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ధరణి పోర్టల్‌ను రద్దు చేసి దీని స్థానంలో భూమాత పేరిట కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని హామీనిచ్చింది. తాజాగా పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు యంత్రాంగం నడుం బిగించడంతో ఏండ్లుగా ఎదుర్కొంటున్న ధరణి సమస్యలకు ఇప్పటికైనా మోక్షం లభిస్తుందా అని అన్నదాతలు, భూ యజమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఉద్దేశంతో గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. భూముల రికార్డులన్నింటినీ ప్రభుత్వం ఆన్‌లైన్ చేసింది. ఇదే అనేక సమస్యలకు కారణమైంది. పట్టాల్లో పేర్లు మార్పిడి..తప్పులు దొర్లడంతో పాటు వివిధ రకాల సమస్యలు ఉత్పన్నమయ్యాయి. సాంకేతిక సమస్యల కారణంగా అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. సీసీఎల్‌ఏ, కలెక్టర్ స్థాయిలో తప్పితే కింది స్థాయిలో అధికారులు పరిష్కరించడానికి వీలు లేకుండా పోయింది. దీంతో రైతులు, భూ యజమానులు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలతో పాటు ప్రజా ఫిర్యాదుల విభాగాలకు వచ్చి పరిష్కరించాలని ప్రదక్షిణలు చేశారు. ఈ పోర్టల్‌పై రైతుల్లో తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ పోర్టల్‌ను రద్దు చేసి కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పడంతో తాజాగా ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం రెవెన్యూ యంత్రాంగానికి ఆదేశాలు జారీచేయడంతో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకొని నివేదికలు రూపొందించి వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

పెండింగ్‌లో 17వేలు ఆర్జీలు

ధరణి పోర్టల్‌లో ఉత్పన్నమైన సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 17,057వేల దరఖాస్తులు రాగా ఇవన్ని పరిష్కారానికి నోచుకోవడం లేదు.

ఆదిలాబాద్ జిల్లాలో 1730, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 3417, మంచిర్యాలలో 7911, నిర్మల్ జిల్లాలో 3999 దరఖాస్తులు వచ్చాయి.

ఇందులో అత్యధికంగా భూ విస్తీర్ణం, సర్వే నెంబర్లలో తప్పులు, పేరు మార్పిడి, పట్టాల్లో తప్పులు దొర్లడం, డిజిటల్ సంతకం పెండింగ్‌లో ఉండటంతో పాటు వారసత్వం కింద పట్టామార్పిడి, డాటా కరెక్షన్, సక్సేషన్ తదితర సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని సరిచేసేందుకు రెవెన్యూ యంత్రాంగం నడుం బిగించింది. ప్రస్తుతం ఆయా జిల్లాల్లో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది వచ్చిన దరఖాస్తుల వారీగా క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారు. దొర్లిన తప్పులను నమోదు చేసుకొని నివేదిక రూపంలో పొందుపరుస్తున్నారు. కొన్ని చోట్ల పరిష్కారం కాకుంటే అప్పుడే రిజక్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా క్షేత్రస్థాయిలో సేకరించి వివరాలను నమోదు చేసుకొని కలెక్టర్‌కు పంపించనున్నారు. ఈ ప్రక్రియను నెలాఖరులోగా పూర్తిచేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

ఇలా ధరణిలో తలెత్తిన పరిష్కరించి అన్నదాతలకు ఊరట కలిగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ఐఎఫ్‌టీయూ ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, భవన, ఇతర నిర్మాణరంగ కార్మికులకు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.20లక్షలు చెల్లించాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి వెంకట్ నారాయణ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో వినోద్‌కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌నారాయణ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. కార్మికుని సహజ మరణానికి రూ.10లక్షలు చెల్లించాలని, ఇళ్ల స్థలాలు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఇంటి స్థలాలు ఉన్న కార్మికులకు ఇంటి నిర్మాణం కొరకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 58 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు కనీస పెన్షన్ రూ.5వేలు ఇవ్వాలన్నారు. బీడీ కార్మికులకు కనీస వేతన జీఓ వెంటనే విడుదల చేయాలని తెలిపారు. కేజీబీవి నాన్ టీచింగ్ వర్కర్స్, ఆశా, అంగన్వాడి, మిడ్ డే మీల్స్, యూనివర్సిటీ, డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంటాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్లకు కనీస వేతనంగా రూ.27వేలు ఇచ్చి రెగ్యులరైజేషన్ చేయాలని, గ్రామపంచాయతీ మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. రూ.27వేల కనీస వేతనం ఇవ్వాలని, 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.27వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, దేవిదాస్, ఆర్కా శేషరావు, మెస్రం మారుతి, భగత్ సంజయ్, పెర్క గంగమ్మ, రాజు, లక్ష్మణ్, ఉల్గారాజ్, అశోక్, ప్రకాష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎర్రాజి హరీష్, మడావి గణేష్ ఏఐకేఎంఎస్ నాయకులు దండేకర్ వామన్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి నులి పురుగుల మాత్రలు మేలు



నవతెలంగాణ-తాంసి

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడానికి నులిపురుగుల మాత్రలు ఎంతో ఉపయోగపడతాయని తాంసి, భీంపూర్ ఆరోగ్య కేంద్రం డాక్టర్లు నిఖిల్‌రాజ్, శ్రావ్యరాణి అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భీంపూర్, తాంసి పరిధిలోని అన్ని గ్రామాల అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో 19సంవత్సరాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను నమిలి మింగించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలనతో పాటు అనీమియా నుండి రక్షణ పొందవచ్చని, నిత్యం పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం, పరిశుభ్రమైన నీరు, ఆహారపదార్థాలను భుజించడం వల్ల నులిపురుగులు నుండి రక్షణ పొందవచ్చని తెలిపారు. నులిపురుగులు శరీరంలో చేరడం వల్ల కడుపు నొప్పి, ఆయాసం, నీరసంగా ఉండడం, మానసిక శారీరక అనారోగ్య లక్షణాలతో అనీమియా బారిన పడతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మోహన్‌రెడ్డి, మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు బి.గంగాధర్, మాయావతి, సంధ్యారాణి, ఆరోగ్య కార్యకర్తలు సరస్వతి, లక్ష్మి, గోదావరి, విజయలక్ష్మి, సుజాత పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

24న చలో ఐటీడీఏను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-బోథ్

షెడ్యూల్ ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని, ఏజెన్సీ బ్యాగ్‌లాక్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న చలో ఐటీడీఏను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీఓ నెం.3ను యథావిధిగా కొనసాగించాలని, జీఓ ఎంఎస్ 3 ప్రకారం ఉద్యోగస్తులకు పదోన్నతులు, బదిలీలు కల్పించాలన్నారు. పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆదివాసీ 9తెగల ప్రజలు, ఉద్యోగస్తులు, సంఘాల నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, మేధావులు మహా ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్క బాపురావు, జిల్లా ఉపాధ్యక్షులు రామెల్లి భోజన్న, నాయకులు కుర్మే రాజన్న, అడ హన్మంతు, సెడ్మకి సీతారాం, నైతం సీతారాం, కనక గణేష్, మడావి గోవర్ధన్ పాల్గొన్నారు.

నీట్‌ను రద్దు చేయాలని సీపీఐ(ఎం) ధర్నా

- ఎన్టీఏ దిష్టిబొమ్మ దహనం
- పాత పద్ధతిలో పరీక్ష నిర్వహించాలని డిమాండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్టీఏ నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలో అవినీతి, అక్రమాలు జరిగినందున వెంటనే పరీక్షను రద్దు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి, ఎన్టీఏ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్టీఏకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ 2013 కంటే ముందు రాష్ట్రాల వారీగా పాత పద్ధతిలో ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన నీట్-2024 అవినీతిపై సుప్రీం కోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్టీఏ చెలగాటం ఆడిందన్నారు. బీహార్‌లో పేపర్ లీక్ కావడం ఒక్కో విద్యార్థి నుండి రూ.30లక్షలు లంచాలు తీసుకోవడం బాధాకరమన్నారు. ఎన్టీఏ చరిత్రలో ఎన్నడూ లేనంతగా 69 మందికీ మొదటి ర్యాంక్ రావడం, గ్రేస్ మార్కుల పేరుతో మార్కులు అదనంగా వేయడం, జూన్ 14న విడుదల చేయాల్సిన ఫలితాలు సార్వత్రిక ఎన్నిక ఫలితాల రోజు జూన్ 4న విడుదల చేయడం చూస్తుంటే అవినీతి ఎంతటి స్థాయిలో జరిగిందో అర్థమవుతోందని అన్నారు. ఎన్టీఏ అవినీతిపై స్పందించాల్సిన ఎన్డీయే ప్రభుత్వం దానికి వత్తాసు పలకడంలో ఆంతర్యం ఏమిటో దేశ ప్రజలకు అర్థం కావడం లేదని అన్నారు. వెంటనే నీట్‌ను రద్దు చేసి, మళ్లీ రాష్ట్రాల వారీగా పాతపద్ధతిలో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, భీంపూర్ మండల నాయకులు దోనిపెల్లి స్వామి, జైనథ్ మండల నాయకులు అరవింద్, సీఐటీయూ నాయకులు పండుగ పొచ్చన్న, అగ్గిమల్ల స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.ఆశన్న, పొచ్చక్క, గంగారాం, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కోట్నక్ సక్కు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేష్



కలెక్టరేట్ ఎదుట ఎన్టీఏ దిష్టిబొమ్మ దహనం

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నార్నూర్

ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యతులో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు లోఖండే దేవ్‌రావ్, ఉత్తం రాథోడ్, దాదే అలీ, అహ్మద్, కె.మహేందర్, రమేష్, దేవిదాస్, షేక్ నసీర్, నవీన్ పాల్గొన్నారు.



చికిత్స కంటే నివారణే మేలు



నవతెలంగాణ-మంచిర్యాల

చికిత్స కంటే నివారణే మేలు అని, ఆరోగ్య సమస్యలు ఎదురయ్యాక చికిత్స తీసుకుంటూ ఇబ్బందులు పడేకంటే వ్యాధి సోకకుండా చర్యలు తీసుకోవడం నయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం పట్టణంలో గల బాలికల పాఠశాలలో వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగు నివారణకు 1 నుండి 19 సంవత్సరాలు కలిగిన పిల్లలు పరిశుభ్రంగా ఉండాలని, పరిశుభ్రతతోనే నులి పురుగు నివారణ జరుగుతుందని తెలిపారు. పిల్లలు బహిరంగ ప్రదేశంలో మల, మూత్ర విసర్జన చేయకుండా తల్లిదండ్రులు చూడాలని, పిల్లలు తినే ఆహారంపై ఈగలు, దోమలు, కీటకాలేవి వాలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిశుభ్రమైన ఆహారం, పండ్లు తినాలని, గోర్లను చిన్నగా ఉంచుకోవాలని, కాళ్లకు చెప్పులు, బూట్లు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో తిరగొద్దని తెలిపారు. ఇవేవీ పాటించకపోతే చిన్నారులు అనారోగ్యం బారిన పడతారని పేర్కొన్నారు. అనంతరం పిల్లలతో మాత్రలు మింగించారు. జిల్లా వైద్యాధికారి అనిత మాట్లాడుతూ నులి పురుగు నివారణకు జిల్లాలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకునే పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్య శాఖ అధికారి ఎస్.యాదయ్య , శిశు సంక్షేమ అధికారి చిన్నయ్య, డాక్టర్ రమేష్, సిడిపిఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

హాజరు శాతాన్ని మెరుగుపర్చుకొని సంస్థ అభివృద్ధికి తోడ్పడాలి



నవతెలంగాణ-నస్పూర్

ఉద్యోగులు హాజరు శాతాన్ని మెరుగుపరుచుకొని సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఎస్ఓ టూ జీఎం పురుషోత్తమరెడ్డి అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకె1ఎ గనిలో గైర్హాజరు ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఓ టూ జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకె1ఎ గనిలో పనిచేస్తున్న ఉద్యోగులు 2023లో కనీసం 100 మస్టర్లు, 2024 మే వరకు కనీసం 50 మస్టర్లు చేయని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి నుండి తప్పని సరిగా ప్రతినెల 20 మస్టర్లు చేయాలన్నారు. సింగరేణి సంస్థలో ఉద్యోగం దొరకడం అదృష్టమని, ఉద్యోగులందరూ హాజరు శాతాన్ని పెంచుకోవాలని కోరారు. సింగరేణి సంస్థ చాలా సదుపాయాలు అందిస్తుందని, ప్రతి ఒక్కరు దీన్ని దృష్టిలో ఉంచుకొని విధులకు హాజరు కావాల్సిందిగా కోరారు. కౌన్సెలింగ్‌కు 70 మంది గైర్హాజరు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి సంజీవరెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, డీవై.సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, డివైపిఎం రాజేష్, సంక్షేమ అధికారి అజ్మీర రమేష్, సేవా సెక్రటరీ కొట్టే జ్యోతి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన స్వచ్ఛంద పౌర సేవా సభ్యులు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్వచ్ఛంద పౌర సేవా సంస్థ సభ్యులు కలెక్టర్ కుమార్ దీపక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందనలు తెలిపి సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో రియల్ ఎస్టేట్ మాఫియా పెట్రేగిపోతోందని, వారికి మున్సిపాలిటీ, పంచాయతీ, రెవెన్యూ అధికారులు అండదండలు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జాకు సహకరిస్తున్నారని, జిల్లాలో చెరువులు చాలా వరకు కబ్జాకు గురయ్యాయని తెలిపారు. ప్రభుత్వ భూములపై కోర్టుల్లో విచారణ జరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు కోర్టుకు హాజరు కావడం లేదని, సత్వర న్యాయం కోసం రెవెన్యూ అధికారులు కోర్టుకు హాజరయ్యేలా చూడాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంస్థ అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి తుల మధుసూదన్‌రావు, సభ్యులు నల్ల నాగేంద్రప్రసాద్, పంచాఙ్గుల ప్రదీప్, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, సునీల్ ఉన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని కాంక్షిస్తు ఆగ్రో డీలర్లు, ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం మర్వాడి ధర్మశాలలో అన్నదానం నిర్వహించారు. ముందుగా వెంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీలర్ల సంఘం నాయకులు గంద్రత్ సంతోష్ మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కప్పతల్లి ఆట ఆడిన అనంతరం అన్నదానం చేపట్టామన్నారు. రైతులు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని దేవున్ని ప్రార్థిస్తు కార్యక్రమాలు చేపడతామన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | జూన్ 21, 2024 | www.navatelangana.com

అదృశ్యమైన బాలుడి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని పాత ఉట్నూర్‌కి చెందిన రాథోడ్ సాయికుమార్(9) అదశ్యమైన నాలుగు రోజుల తరువాత శవమై కనిపించారు. గురువారం శాంతినగర్ చెరువులో సాయికుమార్ శవం లభ్యం అయింది. చెరువు నుండి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమితం ఆస్పత్రికి తరలించారు. తండ్రి రాథోడ్ గోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మనోహర్ తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ పాలకవర్గం

నవతెలంగాణ-ఖానాపూర్



నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌ను గురువారం ఖానాపూర్ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు. ఖానాపూర్ మున్సిపాసిటి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, కౌన్సిలర్ కిషోర్ నాయక్, నాయకులు నాయిని సంతోష్, పరిమి సురేష్, అమనుల్లా ఖాన్, షబ్బీర్ పాషా ఉన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి



నవతెలంగాణ-నార్నూర్

గిరిజన సంక్షేమ శాఖలో సుదీర్ఘంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి ప్రమోషన్లు ఇచ్చి బదిలీలు చేపట్టాలని టీజీయూఎస్ రాష్ట్ర నాయకులు చౌహాన్ నెహ్రూ, జాదవ్ శివాజీ అన్నారు. గురువారం మండలంలోని జామడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిత్‌లకు అప్‌గ్రేడ్ ప్రమోషన్లు కల్పించి, ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్లు అర్హత కలిగిన వారితో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఒకే చోట పనిచేయడం వల్ల మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం సంబంధిత శాఖ అధికారులు వెంటనే గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, పదోన్నతులు, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ చేపట్టాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న సీఆర్టీలను రెగ్యులర్ చేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆడే విశ్వనాథ్, పుష్పలత ప్రేమ్ సింగ్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మండలంలోని బంగారుగూడలో గల ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లీష్ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీష్‌లో పీజీ, బీఈడీలో ఇంగ్లీష్ మెథడాలజితో పాటు బోధనలో అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బయోడెటా, ఫొటో, విద్యార్హతల జిరాక్స్ పత్రాలతో ఈనెల 26లోపు పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. క్లాసు డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. వీరు పాఠశాలతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోధన చేయాల్సి ఉంటుందని, అవర్లీ బేసిస్ ఆధారంగా గౌరవవేతనం ఉంటుందని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్



నవతెలంగాణ-నార్నూర్

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. వర్షకాల సిజనల్ వ్యాధులపై క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే వంద శాతం ప్రసవాలు జరగాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఆయన వెంట ఎన్‌సీడీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబు, సీహెచ్‌ఓ లక్ష్మీ, హెచ్‌ఈఓ నాందేవ్, పీహెచ్‌ఎన్‌ఓ సుశీల,హెల్త్ సూపర్‌వైజర్లు చౌహాన్ చరణ్ దాస్, సత్తవ్వ రాజమ్మ, వైద్య సిబ్బంది ఉన్నారు.

టీజీటీ మ్యాథ్స్ బోధనకు దరఖాస్తులు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో 6 నుండి 8వ తరగతి వరకు మ్యాథ్స్ బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ చినప్ప రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక పోస్టు మాత్రమే ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బీఎస్సీ, బీఈడీతో పాటు టెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈనెల 28న పాఠశాలలో డేమో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. డెమో ద్వారా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. అన్ని సర్టిఫికేట్‌తో సహా హాజరు కావాలని కోరారు.

సొనాల గ్రామ మహార్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సోనాల గ్రామ మహార్ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భీంరావు పాటిల్, ప్రధాన కార్యదర్శిగా మునేశ్వర్ సోమన్న, ఉపాధ్యక్షులుగా వినీత్, కోశాధికారి పాముల సునీల్, కార్యదర్శి అమృత్ రావు పాటిల్, సలహాదారులుగా యేరేకార్ యశ్వంత్ రావు, పాటిల్ లక్ష్మణ్, భగత్ రవీందర్, నాగార్జున పాటిల్‌ను ఎన్నుకున్నరు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భీంరావ్ పాటిల్ మాట్లాడుతూ మహార్ కులానికి ఆర్డీఓ ద్వారా కాకుండా తహసీల్దార్ ద్వారానే కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని, భవిష్యత్తులో సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

శిశుగృహ పిల్లలను

సొంత పిల్లల్లా చూసుకోవాలి

- కలెక్టర్ రాజర్షి షా
- శిశుగృహ కేంద్రం సందర్శన
- పిల్లల పట్ల తల్లి ప్రేమను చూపాలని సూచన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శిశుగృహాలోని పిల్లలను సొంత పిల్లల మాదిరిగా చూసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అక్కడి సిబ్బందికి సూచించారు. గురువారం పట్టణంలోని శిశుగృహాను ఆయన సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడున్న పిల్లల ఆరోగ్య పరిస్థితులు, వారికి అందించే పోషకాల గురించి ఆరా తీశారు. ఆట వస్తువులు లోపల పెట్టకుండా పిల్లలకు అందించాలని సూచించారు. తాను కూడా బిడ్డకు తండ్రి వారికి ఏం కావాలో తెలుసని తెలిపారు. సిబ్బంది పిల్లల పట్ల తల్లి ప్రేమను చూపాలని సూచించారు. అదే విధంగా శిశుగృహా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కరం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ శిశుగృహాలోని సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఇక్కడ ప్రస్తుతం 9 మంది పిల్లలున్నారని తెలిపారు. ఆరుగురు ఆయాలు అవసరమవ్వగా ప్రస్తుతం ఐదుగురు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఒక ఆయాతో పాటు ఏఎన్ఎం అవసమని, వాటిని భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలను నిత్యం అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సిబ్బందికి సూచించడం జరిగిందన్నారు. పిల్లలకు కుటుంబాన్ని ఇవ్వడంలో భాగంగా తార పోర్టల్ ద్వారా దరఖాస్తులు తీసుకుంటున్నామని, ఇది వరకు ఇద్దరిని దత్తత ఇచ్చామన్నారు. అదే విధంగా శిశుగృహాలోని సివిల్ వర్క్సును ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, ఎంప్లాయిమెంట్ అధికారి మిల్కా, డీసీపీఓ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

వస్తువు నాణ్యతపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ కిషోర్



నవతెలంగాణ-నిర్మల్

వస్తువు నాణ్యతపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భారత నాణ్యత ప్రమాణల సంస్థ(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్) ఆధ్వర్యంలో వస్తువుల నాణ్యత ప్రమాణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వస్తువు నాణ్యతపై వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నాణ్యమైన వస్తు సేవలను పొందడం ప్రతి వినియోగదారుని హక్కని, ప్రజలకు వస్తువుల నాణ్యత ప్రమాణాలు, లోపాలపై ఫిర్యాదులు గురించి తెలియజేయాలన్నారు. ఉత్పత్తిదారులు ప్రమాణాలు పాటించాలని సూచించారు. పాఠశాలలలోఎనిమిదవ తరగతి నుంచి స్టాండర్డ్ క్లబ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ డిప్యూటీ డైరెక్టర్ కెవిన్, స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ అభిసాయి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మత్తుపదార్థాలు, మాదకద్రవ్యలకు దూరంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో డవ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యపాన, మాదకద్రవ్య వ్యసన విముక్తి చికిత్స, పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గదులు, రిజిస్టర్లు, రాత్రి డ్యూటీ వివరాలు రెఫరల్ చేసిన పేషంట్ వివరాలు, హోమ్ విసిట్ రిజిస్టర్, ఫాలో ఆఫ్ కేర్ షీట్, రిమ్స్ ఆస్పత్రికి ఎంతమందిని పంపించారు.. ఈ రోజు మెడిసిన్ ఎంతమందికి ఇచ్చారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. యోగా టీచర్ రోజూ వస్తున్నారా సిబ్బంది విధులు సరిగా నిర్వహిస్తున్నారా.. లేదా తదితర వివరాలను అడగగా సమాధానం రాకపోవడంతో పాటు రిజిష్టర్‌లు సరిగా లేకపోవడం, బెడ్స్, పరిసరాలు పరి శుభ్రంగా లేకపోవడంతో నిర్వాహకులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో చికిత్స నిమిత్తం చేరిన వారితో మాట్లాడుతూ ఇక్కడ అందిస్తున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి అవగాహన కల్పించారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-తాంసి

ఏండ్లుగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న అమరేందర్, సంతోష్, సుజాత, పవన్ రావులను గురువారం సత్కరించారు. మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్‌తో పాటు పాఠశాల సిబ్బంది విద్యార్థులు, ఆయా పార్టీల నాయకులు పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించి సేవలను కొనియాడారు. సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఒక విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తాంసి పాఠశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ఇదే పాఠశాలలో చదువుకొని ఉపాధ్యాయునిగా అమరేందర్ పాఠశాలకు చేసిన సేవలు గుర్తుంటాయి. బదిలీలు సహజమే అయినప్పటికీ వారు పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మా గ్రామం మర్చిపోదన్నారు. కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు కూడా మా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. విద్యార్థులు పాడిన పాటలు ఉపన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకుడు రామన్న యాదవ్, హాస్టల్ వార్డెన్ సురేందర్, సిబ్బంది శ్రీనివాస్, రంజన, మహేందర్ పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఘనంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీ 5వ వార్డులోనీ ప్రాథమిక పాఠశాలలో గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల మాత్రాలను మున్సిపల్ చైర్మన్ రాజూరా సత్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఆల్బెండజోల్ మాత్రలను 1 నుండి 19 సంవత్సరాల పిల్లలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పరిమి లత సురేష్, నాయకులు అమనుల్లా ఖాన్, షబ్బీర్ పాషా, వైద్యులు శివ కుమార్, చందన, హాస్పిటల్ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ నిర్మూలనపై అవగాహన



నవతెలంగాణ-నార్నూర్

ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాని పురస్కరించుకొని బుధవారం వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాఠశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులం, జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలతో పాటు వివిధ పాఠశాలలో విద్యార్థులు ర్యాలీ తీశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులను పరీక్షించి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి చంద్రశేఖర్, పిహెచ్‌సి డాక్టర్ రాంబాబు, ఏకలవ్య గురుకులం ప్రిన్సిపాల్ ఉపేందర్, హెచ్‌ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, హిమబిందు, ప్రియాంక, ఈశ్వర్, జవహర్, గోకుల్, విజయలక్ష్మి, జిల్లా సార్మేడి దుర్గు పటేల్, జామడా ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ, పీడీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు సిరిపెల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీల ముమ్మరం కోసం గురువారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. సరిహద్దులో వాహనాల రాకపోకలపై గట్టి నిఘా పెట్టామని పేర్కొన్నారు.

ఎస్సై శ్రీకాంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-సారంగాపూర్

ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను గురువారం మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లోజి నర్సయ్య, వెంకట రమణ, జగదీష్, విలాస్‌రావ్, ఆది, లక్యానాయక్, మసీర్, తేజు, ఒల్ద్రి నారాయణరెడ్డి, రాంరెడ్డి, భూమన్న, నాగన్న, ముత్యంరెడ్డి, సుభాష్‌రెడ్డి, రాజన్న, లక్ష్మణ్, చందు, లింగారెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ వ్యవస్థలోకి తిరిగి తీసుకోవాలని వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతనంగా ఏర్పాటు కాబోయే గ్రామ రెవెన్యూ వ్యవస్థలోకి తిరిగి తీసుకోవాలని వీఆర్వోల సంఘం నాయకులు కోరారు. ఈ విషయమై గురువారం కలెక్టర్ రాజర్షి షా ను కలిసి వినతిపత్రం అందజేశారు. తిరిగి రెవెన్యూ శాఖలో తీసుకుంటేనే తమ సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు వెంకటి, అసోసియేషన్ అధ్యక్షులు వామన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనసూయ, అహల్య, నారాయణ, వినోద్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

ఐకేపీ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఉట్నూర్ మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన రాజలింగు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ గురువారం వారింటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజలింగు మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ పరంగా వచ్చే ఆర్థిక సాయం త్వరగా అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కనక సుదర్శన్, పెందూర్ గణపతి, శంకర్, గోవింద్, మహిళా నాయకురాలు రాజవ్వ పాల్గొన్నారు.



నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం స్వాధీనం

- ఇద్దరిపై కేసు నమోదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



నాటుసారా తయారీకి వినియోగించే బెల్లాన్ని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. నాటు సారా తయారీదారులకు బెల్లం రవాణా చేస్తున్న టాటా ఏసీ వాహనాన్ని చింతలమానేపల్లి మండలం లంబాడిహెట్టి గ్రామంలో పట్టుకోగా అందులో రవాణా చేస్తున్న 660కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. ఈ ఘటనలో లంబాడిహెట్టి గ్రామానికి చెందిన అజ్మీర సీతారాంతో పాటు సైరి రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఐఐటీ ర్యాంకర్‌కు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నవతెలంగాణ-వాంకిడి



ఐఐటీ ర్యాంకర్‌కు ఎమ్మెల్యే కోవ లక్ష్మీ ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌తో పూర్తి చేసి జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ఆల్ ఇండియా 1782 ర్యాంక్ సాధించిన దుర్గం అర్జున్‌కు తిరుపతి ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో సీట్ వచ్చింది. ఎమ్మెల్యే అభినందించి ఆర్థిక సాయం అందజేసి కోర్సు పూర్తి అయ్యేంతవరకు చదివించడానికి తన వంతు సహకారం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వాంకిడి ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, కళాశాల ఉపన్యాసకులు చంద్రయ్య కిరణ్, రాజమౌళి, సంతోష్, అశ్విని పాల్గొన్నారు.

అప్పుల బాధ భరించలేక యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-కాగజ్‌నగర్



అప్పుల బాధ భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక శ్రీరాంనగర్ కాలనీకి చెందిన అవదూత భాస్కర్ (30) అప్పుల బాధ భరించలేక, తాగుడుకు బానిసై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య అవదూత నీహారిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు. మృతునికి ఒక కూతురు ఉంది.

ప్రధాన చౌరస్తాలలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తాలలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ స్థానిక లారీ చౌక్‌తో పాటు రాజీవ్ చౌక్, ఎన్టీఆర్ చౌక్‌లలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టినా ఫలితం లేదన్నారు. అవసరం లేని చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారని ఆరోపించారు. స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుతో పాటు సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చాపిలె సాయికృష్ణ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన రాయితీ యూరియా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయంలో ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో ఛైర్మన్ అలీబిన్ అహ్మద్‌తో కలిసి రాయితీ యూరియా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఎక్కువ ధరలు పెట్టి యూరియా కొనుగోలు చేయకూడదన్నారు. ఎక్కువ ధరలకు ఎరువులు అమ్ముతున్న వారిపై వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో సహకార సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల వారిగా యూరియా పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్, ఏఈఓ చిరంజీవి, నాయకులు సుంకరి పెంటయ్య, మధుకర్, నారా ఆశన్న బాపురావు, పుదరి నారాయణ పాల్గొన్నారు.

బదిలీపైన వెళ్తున్న బ్యాంక్ అధికారికి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

బదిలీ పదోన్నతిపై టీజీబీ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ నరేష్‌ను జడ్పీటీసీ మేముర్ల సంతోష్ సన్మానించారు. గురువారం టీజీబీలో ఆయనున్న సత్కరించి అభినందనలు తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్‌గా మండలానికి వచ్చిన నరేష్ మేనేజర్‌గా పదోన్నతి పొంది బదిలీ కావడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా జడ్పీటీసీ సంతోష్ అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శాస్త్రి, కాంగ్రెస్ నాయకులు జకీర్, ముంజం రవి, రైతులు పాల్గొన్నారు.

వర్షం కోసం గ్రామస్తుల కప్పతల్లి ఆటలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు గడిచినప్పటికీ వర్షం రాకపోవడంతో జిల్లాలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కోసం మండలంలోని బూరుగూడ గ్రామానికి చెందిన రైతులు కప్పతల్లి ఆటలు ఆడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం రాకపోవడంతో చేన్‌లో నాటిన పత్తి గింజలు చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కూడా నాటిన గింజలు మొలకెత్తలేదన్నారు. వందలాది ఎకరాల్లో గింజలు మొలకెత్తని పరిస్థితి ఉందని, అందుకే కప్పతల్లి ఆటలతో దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్టాండ్ లేక ఇక్కట్లు..!

ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలంటే అధికమంది బస్సులను ఆశ్రయిస్తుంటారు. బస్సు కోసం వేచిచూసేందుకు అనేక చోట్ల బస్టాండ్‌లు కనిపించని పరిస్థితి. ముఖ్యంగా మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్డుపక్కనున్న చెట్లే ప్రయాణికులకు బస్టాండ్‌లుగా మారుతున్నాయి. అక్కడ నిలబడితే బస్సు వచ్చి ఆగుతుంది. బస్సు కోసం నిరీక్షిస్తున్న సమయంలో వర్షం వచ్చినా..ఎండ ఉన్నా తప్పనిసరి పరిస్థితిలో అక్కడే ఉండాలి. లేదంటే సమీప హోటల్‌ల దగ్గర నిలబడాలి. ఇది ఉమ్మడి జిల్లాలోని అనేక ప్రాంతాల పరిస్థితి. ఆయా గ్రామీణ ప్రాంతాల వద్ద బస్‌సెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఏండ్లుగా అవస్థలు పడుతున్నారు.

నవతెలంగాణ- దహెగాం

- ఎండ..వానకు రోడ్డు మీదనే నిరీక్షణ
- అష్టకష్టాలు పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం



బస్సు కోసం చెట్ల కింద నిరీక్షిస్తున్న ప్రయాణీకులు

జిల్లాలోని అనేక మండలాల్లో ప్రయాణ ప్రాంగణాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వానాకాలం ప్రారంభమైంది. ఆయా గ్రామాలకు ప్రయాణించే ప్రయాణికులు బస్టాండు లేకపోవడంతో వర్షాకాలంలో నిల్వ నీడలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎండాకాలంలో ఎండకు, వానాకాలం వర్షానికి తడుస్తూ ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఎండాకాలంలో చెట్ల నీడల్లో, వర్షాకాలంలో హెూటళ్ల, వేరే ఇతర దుకాణ సముదాయాల్లో నిరీక్షించాల్సి వస్తుంది. కొన్ని మండలాల్లో ప్రయాణ ప్రాంగణాలు ఉన్నా ఊరి చివరన ఉండడంతో నిరుపయోగంగా మారాయి. ఉన్న బస్టాండ్లలో సైతం కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

కరువైన ప్రయాణ ప్రాంగణాలు...

జిల్లాలో దహెగాం, సిర్పూర్(టి), బెజ్జూరు, కెరమెరి, జైనూర్, రెబ్బెన, చింతలమానెపెల్లి మండలకేంద్రాలతో పాటు మరికొన్ని మండలాల్లో కూడా ప్రయాణ ప్రాంగణాలు లేవు. దీంతో ప్రయాణికులు బస్సు ల కోసం రోడ్లపైనే నిరీక్షిస్తున్నారు. నిత్యం ఆయా మండలాల నుండి వందలాది మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. కానీ ప్రభుత్వం ప్రయాణికులకు బస్టాండు నిర్మించడంలేదని ప్రజలు విమమర్శిస్తున్నారు.

పలుచోట్ల నిరుపయోగం...

జిల్లాలోని కొన్ని మండలాల్లో ప్రయాణ ప్రాంగణాలు లేకపోగా మరికొన్ని మండలాల్లో అవసరం లేనిచోట నిర్మించడంతో నిరుపయోగంగా మారాయి. వాంకిడి మండల కేంద్రంలోఓని బస్టాండు మార్కెట్‌కు దూరంగా నిర్మించడంతో ప్రయాణికులు బస్టాండులో వేచి ఉండడంలేదు. దీంతో బస్సు సైతం బస్టాండుకు వెళ్లన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం బస్టాండ్లు యాచకులకు అడ్డాగా మారింది. అలాగే సిర్పూర్ మండలకేంద్రంలోనూ చిన్నపాటి బస్టాండుకు దూరంగా నిర్మించడంతో ప్రస్తుతం అది పిచ్చికుక్కలతో నిండిపోయి వినియోగంలోకి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

చెట్లు,హోటళ్లే దిక్కు...

చాలాచోట్ల బస్టాండులు లేకపోవడంతో ప్రయాణికులకు చెట్లు, హోటళ్లే దిక్కువుతున్నాయి. చెట్ల నీడన, హోటళ్లలో నిల్చొని బస్సు కోసం ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు. బస్టాండ్లలో సౌకర్యాలు కూడా లేకపోవడంతో బస్సుల కోసం వేచిచూడకుండా ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం చేయాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణ ప్రాంగణాలు నిర్మించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులకు లోబడి పనులు చేయాలి

- కేంద్ర పర్యావరణ శాఖ ఐఆర్ఓ త్రినాథ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వ అనుమతులకు లోబడి సింగరేణి ఓపెన్ కాస్ట్ పనులు చేయాల్సి ఉంటుందని కేంద్ర పర్యావరణ శాఖకు సంబంధించిన ఇండియన్ రీజనల్ అధికారి(ఐఆర్ఓ) త్రినాథ్ సూచించారు. జిల్లాలోని ఆసిఫాబాద్ తిర్యాని ,రెబ్బెన రేంజ్ పరిధిలోని గోలేటి ఓసీపీ, డోర్లి ఓసీపీ, డి గ్రేడెడ్ అటవీ ప్రాంతంతో పాటు అటవీ శాఖకు బదిలీ అయిన రెవెన్యూ భూములను కాళేశ్వరం ఎఫ్డీపీటీ శాంతారామ్, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోలేటి ఉపరితల బొగ్గు గనుల్లో భాగంగా 615 హెక్టార్ల అటవీ భూమి బదిలీ అనుమతుల కోసం ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు. దీనికి గాను డోర్లిలో ఇప్పటికే మూసివేయబడ్డ సింగరేణి గనుల ప్రాంతాన్ని అటవీ శాఖకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. అయితే అనుమతుల కోసం ఇచ్చిన ప్రతిపాదనకు మించి ఎక్కువ అటవీ భూమి



రెబ్బెన : అటవీ భూముల గురించి తెలుసుకుంటున్న కేంద్ర పర్యావరణ శాఖ ఐఆర్ఓ



ఆసిఫాబాద్ : మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేంద్ర పర్యావరణ శాఖ ఐఆర్ఓ త్రినాథ్

బదిలీ కాకుండా చూడాలన్నారు. సింగరేణి అధికారులు ఎప్పటికప్పుడు అటవీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ భూ బదిలీ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎఫ్ఆర్ఓ అప్పలకొండ, బెల్లంపల్లి ఎఫ్డీఓ విజయ్ కుమార్, సింగరేణి జనరల్ మేనేజర్ రవి ప్రసాద్, తిర్యాని ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, రెబ్బెన, బెల్లంపల్లి, గిన్నెదరి ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓలు శ్రీధరచారి, సుభాష్, ప్రవీణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రెబ్బెన : మండలంలోని గోలేటి ఓసీ అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ శాఖ అటవీశాఖ ఇండియన్ రీజనల్ అధికారి త్రినాథ్ అటవీశాఖ భూములను పరిశీలించారు. గోలేటి ఓసీపీకి సంబంధించిన అనుమతులు, ఇతరత నిర్మాణాల కోసం ఆయన వాటిని పరిశీలించారు. అడవి భూములను కోల్పోయిన స్థలంలో మొక్కలు నాటగా వాటిని పరిశీలించి సూచనలు చేశ్వారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎఫ్ఆర్ఓ అప్పలకొండ, బెల్లంపల్లి ఎఫ్డీఓ విజయ్ కుమార్, సింగరేణి జనరల్ మేనేజర్ రవి ప్రసాద్, తిర్యాని ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, రెబ్బెన, బెల్లంపల్లి, గిన్నెదరి ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓలు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాంభట్‌తో కలిసి కలెక్టర్ నులిపురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలు జిల్లాలో 1,73,494 మంది ఉన్నారన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలతో పాటు బడిబయట ఉన్న పిల్లలకు మాత్రలు ఇవ్వాలన్నారు. చెప్పులు లేకుండా నడవడం, మట్టిలో ఆడటం, చాక్ పీసులు, బలపాలు, మట్టి తినడం వల్ల పిల్లల శరీరంలో నులిపురుగులు తయారవుతాయన్నారు. ఇవి పేగుల్లో ఉండి రక్తాన్ని పీల్చుకుంటాయని, ఫలితంగా పిల్లల్లో రోగ నిరోధక శక్తి లోపించి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు వేయడం వల్ల నులిపురుగులు పిల్లల శరీరం నుంచి బయటకు పోతాయన్నారు. నులిపురుగుల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం, పండ్లను, కూరగాయలను నీటితో కడిగిన తరువాతనే ఉపయోగించడం, తరచూ చేతులను శుభ్రం చేసుకోవడం వంటివి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ఒకటి నుండి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను వేయించాలని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అర్షిన్ అన్నారు.



ఆసిఫాబాద్ : విద్యార్థికి మాత్రవేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

గురువారం మండల కేంద్రంలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ స్కూల్‌లో పిల్లలకు మాత్రాలను ఎంపీడీఓ అల్బర్ట్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ గంగాసింగ్, ఏఎన్ఎం సావిత్రి, వైద్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని అల్బెండోజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను మాత్రలను అందించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కమల, పంచాయతీ కార్యదర్శి తుకారం, ఏఎన్ఎంలు సుమలత, మేఘన, ఆశా కార్యకర్త వైశాలి, నాయకులు తెలంగాణ జావిద్, గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్



బెజ్జూర్

ఎస్పీగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

- కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించిన ఎస్పీ
- ఎస్పీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా నూతన ఎస్పీగా డీవీ శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ డీసీపీగా పనిచేసి బదిలీపై వచ్చి ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. 2013 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్ రావు 2007లో గ్రూప్-1 సర్వీస్ ద్వార ఎంపికై కరీంనగర్ డీఎస్పీగా నియమితులయ్యారు. గతంలో మహబూబ్ నగర్ అడిషనల్ ఎస్పీగా, రాచకొండ కమిషనరేట్‌లో అడ్మిన్‌గా, నల్గొండ జిల్లా విజిలెన్స్ శాఖలో ఎస్పీగా విధులు నిర్వహించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి జిల్లాలోని పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో శాంతి భద్రతలు, జిల్లాలోని సమస్యలపై అధికారులతో చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు.



కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

ఎస్పీగా బాధ్యతలు స్వీకరించినంతరం శ్రీనివాసరావు కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ఎస్పీ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని శాంతిభద్రతలకు సంబంధించిన వివిధ అంశాలు వారి మధ్య చర్చకు రాగా, శాంతి భద్రతల పరిరక్షణలో సమిష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ సూచించారు.

ఎస్పీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

జిల్లాకు బదిలీపై వచ్చిన నూతన ఎస్పీ శ్రీనివాసరావును కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని పలు అంశాలు ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లినట్లు నాయకులు తెలిపారు. ఇందులో నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి పటేల్, మహిళా సంఘం నాయకురాలు మంగ, నాయకులు జక్కన్న శ్రీనివాస్, ఆనంద్, శ్రీకాంత్, మిలింద్ ఉన్నారు.

హామీలను దశాల వారీగా నెరవేరుస్తాం



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలోని వివిధ ఏరియాలలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) గెలిచి ఆరు నెలలు గడుస్తున్న కంపెనీ గుర్తింపు పత్రం ఇవ్వలేదని, అయిన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలు దశలవారీగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని కేంద్ర కమిటీ సభ్యులు, పర్మినెంట్ వేజ్ బోర్డు నెంబర్ వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లి ఏరియా లో ఖైరగూడ ఓపెన్ కాస్ట్, రెబ్బెన సీహెచ్‌పీలో నిర్వహించిన సమావేశాల్లో యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌తో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక పిల్లల ఉద్యోగ అర్హతకు 35 సంవత్సరాల వయోపరిమితిని 40 సంవత్సరాలకు పెంచడం, హౌస్ బిల్డింగ్ లోన్స్ వడ్డీ చెల్లింపులో కాల పరిమితి లేకుండా అందరికీ సమాన వడ్డీ చెల్లించేటట్టు ఒప్పందం కుదుర్చుకోవడం లాంటివి తమతో సాధ్యమయ్యాయని తెలిపారు. పాత పద్ధతిలోనే అన్ని వార్డులు సరైన వైద్య సదుపాయాలు డాక్టర్లను రప్పించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ యూనియన్ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు కార్మికులు చేరాగా వారికి కండువాలు వేసి స్వాగతించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి చిప్ప నరసయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శిలు జూపాక రాజేష్, కే.కిరణ్ బాబు, బి జగ్గయ్య, మీస చంద్రశేఖర్, దేవరకొండ పాల్గొన్నారు

పంచాయతీ దస్త్రాలను నవీకరించుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పంచాయతీ దస్త్రాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని నాగంపేటలో గురువారం పంచాయతీ దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీకి విడుదలైన నిధులు, ఇంటి పన్నుల వసూలు, వ్యయాలను నగదు పుస్తకంలో నమోదు చేయాలన్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్మశానవాటిక, సెగ్రిగేషన్ షెడ్డు నిర్వహణ తీరును పరిశీలించారు. పొడి,తడి చెత్తను వేర్వేరు చేసి వర్మికంపోస్టు తయారు చేయాలన్నారు. ఈ సందర్భంగా నాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఎంపీఓ గౌరీశంకర్, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ సరస్వతీ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మిలు పాల్గొన్నారు.

4
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | జూన్ 21, 2024 | www.navatelangana.com

టీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శిగా చంద్రశేఖర్



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ స్టూడెంట్ యూనియన్(టీఎస్‌యూ) రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని బాదంపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం తెలంగాణ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లగొండ అంజి నియామక పత్రాన్ని అందించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం పనిచేస్తానని అన్నారు. విద్యార్థులకు అండగా నిలుస్తామన్నారు. కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఈ యూనియన్‌లో చేరాలని సూచించారు. తనకు రాష్ట్ర కార్యదర్శిగా పదవిని ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు నల్లగొండ అంజికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పబ్లిక్ టాయిలెట్స్, బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



సీసీసీ కార్నర్‌లో పబ్లిక్ టాయిలెట్, బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాలు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నస్పూర్ మండల కార్యదర్శి మిడివెల్లి రాజ్‌కుమార్ మాట్లాడుతూ నస్పూర్ మున్సిపాలిటీ కమిషనర్ ఈ విషయంలో సానుకూలంగా స్పందించారని తెలిపారు. లేనిపక్షంలో తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌జీ గంగాధర చారి, కుమారస్వామి, అరవింద్, అభినవ్, దమ్మాల రాములు పాల్గొన్నారు.

బెల్లంపల్లి మున్సిపాలిటీ సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి మున్సిపాలిటీలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ కోరారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌కు ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపాలిటీలోని వార్డుల్లో ప్రజలకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కూరగాయల మార్కెట్ వంటి ముఖ్యమైన కూడలిల్లో శిథిలావస్థకు చేరుకున్న రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ప్రధాన మురికి కాలువలను శుభ్రపరచకపోవడం వల్ల డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. మెయిన్ డ్రైనేజీలు(ఒర్రె)లు నిండిపోయి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు రోగాల బారిన పడకుండా పారిశుధ్య పనులను చేపట్టాలని కోరారు లేనియెడల స్థానిక ప్రజలను చైతన్యపరిచి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

ప్రజా పోరాటాలకు ప్రజలు సహకరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-జైపూర్

ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు సీపీఐ(ఎం) పోరాటం చేస్తుందని దీనికి ప్రజలందరు సహకరించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. ఈ నెల 28 నుండి 30 వరకు బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించ తలపెట్టిన సీపీఐ(ఎం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కర పత్రాలు గురువారం చెన్నూర్ పట్టణంలో ఆవిష్కరించారు. సీపీఐ(ఎం) చేస్తున్న ప్రజా పోరాటాలకు ప్రజలు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంతో పాటు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పేద ప్రజలకు రైతులకు మద్దతుగా పోరాటాలు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడికి గురవుతున్న రైతుల ఇబ్బందులు, భీమారం సమీపంలో గల జోడు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని సీపీఐ(ఎం) పాద యాత్ర చేపట్టిన తీరును వివరించారు. అంతేకాకుండా పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో ముంపుకు గురవతున్న తీర ప్రాంత వ్యవసాయ భూములకు పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న పార్టీకి ప్రజలు ఆర్థికంగా సహకరించాలని కోరారు. బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించనున్న రాజకీయ తరగతులకు జిల్లా పరిధిలో గల 18 మండలాల నుండి సుమారుగా 300 మంది నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారని తెలిపారు. దాతలు, ప్రజలు ఆర్థికంగా సహయ సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటి సభ్యులు బోడంకి చందు, స్థానిక నాయకులు సిడాం సమ్మక్క, బండారి రాజేశ్వరి, గావిడి భూదేవి, తుమ్మ రేణుక, యామిని, సహన, కరీమా, రమాదేవి, కుమార్, మధు, శ్రీనివాస్, సరిత, రాజమ్మ, రాజేశ్వరి, శంకరమ్మ పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

ఇంటి ఆవరణలో గంజాయి సాగు



నవతెలంగాణ-మందమర్రి

ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్న వ్యక్తిపై మందమర్రి పోలీసులు కేసు నమోదు చేశారు. కెకె-5 ఫిల్టర్ బెడ్ ఏరియాకు చెందిన కస్తూరి లింగయ్య(50), తండ్రి రాజం తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు పక్కా సమాచారంతో గురువారం తనిఖీలు చేయగా 13 గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు కనిపించింది. ఐదుగురు వ్యక్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి మొక్కలను స్వాధీనం చేసుకుని నేరస్థుడు లింగయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

సూర్య నమస్కారాలతో ఆరోగ్యం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆరోగ్యం కోసం ప్రతిరోజు కొంత సమయాన్ని వ్యాయామం కోసం కేటాయించేవారి సంఖ్య ఎక్కువైంది. కొందరు నడక, మరికొందరు పరుగు, ఇంకొందరు క్రీడలు, జిమ్, సైక్లింగ్ ఇలా ఏదో ఒక దానిపై శ్రద్ధ పెడుతు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా పట్టణానికి చెందిన హోంగార్డు మూషిణి వెంకటేశ్వర్లు సూర్య నమస్కారాలు 365 రోజులు నిరాటకంగా సాధన చేస్తున్నాడు. క్రమం తప్పకుండా ప్రతిరోజు సుమారు గంట సమయాన్ని కేటాయించుకుని 108(1296 ఆసనాలు) చేస్తున్నారు. ఇంకా సాధనను కొనసాగిస్తూనే ఉన్నారు. గతంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటేశ్వర్లుకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు కూడా లభించింది. అంతే కాకుండా మాజీ గవర్నర్ తమిళసై చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ముషిణి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి రోజు 108 సూర్య నమస్కారాలు చేస్తు 2 సంవత్సరాలు ముగించుకొని 3వ సంవత్సరోలోకి అడుగు పెట్టడం జరిగింది. రామగుండం కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు ఆర్ఐ మల్లేశం సర్ అభినందించడం చాలా సంతోషాన్నిచ్చిందని అన్నారు.

మార్కెట్ రేట్ ప్రకారం పరిహారమివ్వాలి

- కలెక్టర్‌ను కలిసి పరిసర గ్రామాల బాధితులు



నవతెలంగాణ-జైపూర్

నాగాపూర్-విజయవాడ మధ్య నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులకు మార్కెట్ రేట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని పరిసర గ్రామాల బాధితులు డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కుమార్ దిలీప్‌ను గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో నర్వ గ్రామ శివారు నుండి పౌనూర్ గ్రామ పంచాయతీ గోపాల్‌పూర్ వరకు గల వ్యవసాయ భూములను హైవే రోడ్డు నిర్మాణంలో నష్టపోతున్నట్లు వివరించారు. నష్టపోతున్న భూముల విలువ ప్రస్తుత బహిరంగ మార్కెట్ రేట్ ఎకరా ఒకంటికి రూ.40 లక్షల నుంచి రూ.కోటి వరకు ధర పలుకుతుందని వెల్లడించారు. ఇట్టి విలువగల భూములు ఇక్కడ నష్టపోయి మరో చోట కొనుగోలు చేయాలన్నా అమ్మకానికి భూములు లేక పోగా ప్రభుత్వం చెల్లిస్తామంటున్న ధరతో కొనుగోలు చేయలేని పరిస్థితి ఎదురైందని తెలిపారు. అతి తక్కువ రేటుతో నష్టపరిహారం చెల్లించడానికి నిర్ణయించుకున్న ప్రభుత్వం తమకు నోటీసులు జారీ చేయడం సమంజసం కాదని, ఈ క్రమంలో రైతులకు భారీగా నష్టం జరుగుతుందని ఆవేధన వ్యక్తం చేశారు. మార్కెట్ రేటుకు అనుగుణంగా చెల్లించే విధంగా పరిహారం పెంచడానికి కృషి చేయాలని కోరిన రైతులు ఈ నెల 12న అప్పటి జిల్లా కలెక్టర్‌కు వినతీ పత్రం ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విద్యాసాగర్ రెడ్డి, రాంరెడ్డి, జనార్ధన్ రెడ్డి, చెరుకు రాంచంద్రా రెడ్డి, క్రిష్ణమూర్తి, కే జనార్ధన్ రెడ్డి, తుమ్మల క్రిష్ణారెడ్డి, సీహెచ్ విజలక్ష్మి, అఖిల, తిరుపతి, వేణుగోపాల్ ఉన్నారు.

అదును, పదును చూసి రైతులు పత్తి విత్తనాలు వేసుకోవాలి



నవతెలంగాణ-కాసిపేట

అదును పదును చూసి రైతులు పత్తి విత్తనాలు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారిని డి వందన సూచించారు. గురువారం మండలంలోని వెంకటాపూర్, కొండాపూర్, ముత్యంపల్లి గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు పత్తి పంట వేసే క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి డీ వందన మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు ముందస్తు విత్తనాలు వేయకుండా పూర్తి స్థాయి వర్షాలు పడి, వర్ష పాతం 60-70 ఎంఎం నమోదు అయిన తర్వాతనే పత్తి విత్తనాలు వేసుకోవాలన్నారు. అధిక ఉష్ణోగతల వల్ల భూమిలో వేడి ఉండడం వల్ల పత్తి విత్తనాలు మొలకలు లేకుండా ఉండడం జరుగుతుందన్నారు. ముందుస్తు విత్తనాలు వేయటం వలన మొలకలు సరిగా రాకపోతే విత్తన ఖర్చు, కూలీ ఖర్చు పెరుగుతుందన్నారు. రైతులకు సరిపడా పత్తి విత్తనాలు, వరి విత్తనాలు, కందులు అందుబాటులో ఉన్నాయని, వివిధ పంటలకు సరిపడా ఎరువులు కూడా అందుబాట్లో ఉంచడం జరిగిందన్నారు. రైతులెవ్వరు ఆందోళన చెందకుండా అవసరం ఉన్నప్పుడు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కే రమ్య, అంజలి, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- భీమారం ఎంపీడీఓ రాధారాథోడ్



నవతెలంగాణ-జైపూర్

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీల పరిధిలో ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని ఎంపీడీఓ రాధా రాథోడ్ సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో, ఉపాధి హామీ సిబ్బందితో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలని, బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీల నుంచి మొక్కలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉండాలని, మిషన్ భగీరథ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల పరిధిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని తెలిపారు.

నేరాల నియంత్రణకు 'గ్రామాల్లో పోలీస్ నైట్ హాల్ట్'

నవతెలంగాణ-జన్నారం

ప్రజలకు మీ రక్షణ, భద్రత గురించి ఎల్లప్పుడూ అందుబాటులో, చట్టపరిధిలో మీ సమస్యలు పరిష్కరిస్తూ పోలీస్ మీకోసం ఉంటుందనే నమ్మకం కల్పిస్తూ నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు 'గ్రామాల్లో పోలీస్ నైట్ హాల్ట్' కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు జన్నారం ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. దానిలో భాగంగా బుధవారం రాత్రి మొట్ట మొదటి సారిగా జన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చింతగూడ గ్రామంలో పోలీస్ నైట్ హాల్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజా వర్ధన్ గ్రామ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా మెలగాలన్నారు. ఘర్షణలకు పాల్పడకుండా స్నేహ భావంతో ఉండాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. యువతను ఉద్దేశిస్తూ గంజాయి, ఇతర అసాంఘిక కార్యక్రమాల జోలికి పోయి యువత తమ బంగారు భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి రవాణా అడ్డుకట్ట వేయడానికి గ్రామస్థుల సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా యవత అసాంఘిక కార్యకలాపాలపైపు పెడదారి పట్టి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గ్రామస్తులకు వివరించారు, గ్రామాల్లో సిసి కెమెరాల ఏర్పాట్ల ఆవశ్యకత వివరించారు. జైలు నుంచి విడుదలై వచ్చిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టడంతోపాటు స్థానికేతరులపై నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు వస్తే వెంటనే పోలీస్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగుల ఆత్మ గౌరవం కాపాడాలి

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణిలో మహిళా ఉద్యోగుల ఆత్మ గౌరవం కాపాడే విధంగా యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని మందమర్రి ఏరియా హెచ్ఎంఎస్ మహిళా విభాగం నాయకురాలు డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ మణుగూరు మహిళా వైస్ ప్రెసిడెంట్ కోడిపెల్లి శ్రీలత, కెకె ఓసీ ఫిట్ సెక్రటరీ మౌనికలు గురువారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. మహిళలుగా మేము ఏ పనైనా చేస్తామని కానీ మా ఆత్మగౌరవం కాపాడేవిధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాన్నారు. ఆర్జీ వర్క్ షాప్, ఏరియా హాస్పిటల్, కెకె-5, శాంతిఖనిలో జరిగిన వరుస సంఘటనలు మహిళల భద్రతని ప్రశ్నించే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను మీ తోటి అక్కా చెల్లెల్లుగా భావించాలన్నారు. శాంతిఖని ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని ఉద్ఘాటించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా అగాంతుకులపై యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.

ఉత్పత్తిపై చూపిన శ్రద్ధ వసతుల కల్పనపై ఏదీ..?



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి పట్ల చూపిస్తున్న శ్రద్ధ కార్మికులకు కనీస వసతులు కల్పించడంపై చూపించడం లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు విమ్మర్శించారు. ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్యతో పాటు శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శులు గురువారం ఇందారం-1ఏ గనిని సందర్శించి కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెల్సుకున్నారు. ఐకే-1ఏ గనిపై కనీస మౌలిక వసతులు కల్పించకపోవడం బాధాకరమని ఆవేధన వ్యక్తం చేశారు. కార్మికులకు అందించే పని ముట్లు నాణ్యతతో కూడినవి అందించాలని, పని స్థలాలలో పని ముట్లు అందుబాటులో ఉంచాలని, డ్రిల్ బిట్స్ కొరతను వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. వెంటిలేషన్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గని మేనేజర్‌ను కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సమస్యల పట్ల స్పందించిన గని మేనేజర్ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, పిట్ కార్యదర్శి అరిక రాజయ్య, కార్మికులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం



తాండూర్‌లో..

నవతెలంగాణ-తాండూర్

పిల్లల్లో నులి పురుగులను నివారించడంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించినవారమవుతామని డిప్యూటీ డీఎంహెచ్ఓ రవి కిరణ్ తెలిపారు. గురువారం తాండూర్ మండలంలోని కస్తూర్బా గురుకులంలో జాతియ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు వృద్ధి చెందడం ద్వారా రక్తహీనత అజీర్తి మందకోడితనం బరువు కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ముఖ్యంగా పిల్లల్లో అపరిశుభ్రత వల్ల నులిపురుగులు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. చేతులు శుభ్రంగా కడుగకపోవడం, అపరిశుభ్రమైన భోజనాన్ని భుజించడం, శారీరక శుభ్రత లేకపోవడం వల్ల కడుపులో నులిపురుగులు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం నులిపురుగుల నివారణకు గాను ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు మాత్రలను నిర్లక్ష్యం చేయకుండా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ రమేష్, సీహెచ్ఓ శ్రీనివాస్ కస్తూర్బా ఎస్ఓ సుమన చైతన్య, తాండూర్ ఏఎస్ఎం శోభ పాల్గొన్నారు. ఆదేవిధంగా మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో, నర్సాపూర్, మాదారం పాఠశాలలలో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పిల్లలకు మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, ఏఎస్ఎం పారిజాతం, ఉపాధ్యాయురాలు శ్రీ లక్ష్మీ మాదారం ఏఎస్ఎం పుష్ప పాల్గొన్నారు.

జన్నారం : పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు వేయాలని జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన అన్నారు. గురువారం ప్రపంచ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా, మండలంలోని లిటిల్ హాండ్స్, ఇతర ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రం 1లో, వేరువేరుగా చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు(ఆల్బెండజోల్ టాబ్లెట్లు) వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, మండల ప్రభుత్వ వైద్యురాలు ఉమాశ్రీ, జన్నారం ఎంపీటీసీ మహమ్మద్ రియాజుద్దీన్, గుండవరపు మధుసూదన్‌రావు, ఏఎస్ఎం మాధవి అంగన్‌వాడీ టీచర్ జాడి సంజీవరాణి, ఆశా కార్యకర్త రజిత, ఆయా మమత పాల్గొన్నారు.



జన్నారంలో..



కాసిపేటలో..

జైపూర్ : మండలం టేకుమట్ల, గంగిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మందు బిళ్ళలు పంపిణీ చేశారు. అంతర్జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్‌తో కలిసి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మందు బిల్లలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంగిపల్లి ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారి వేదశ్రీ, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ 2ను రద్దు చేయాలి

నవతెలంగాణ-నార్నూర్



ప్రభుత్వం వెంటనే జీవో నెం.2ను రద్దు చేయాలని టీజీయుఎస్ జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే విశ్వనాథ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో అడక్వేసి విధానాన్ని ఎత్తివేయాలని, డేట్ ఆఫ్ అక్వైరింగ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మొదటి నియామకం తేదీ నుంచే సీనియారిటీ లెక్కించి ప్రమోషన్ కల్పించాలన్నారు. నిరసన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చౌహాన్ నెహ్రూ, ఉపాధ్యాయులు రాథోడ్ హరిచంద్, చంపావతి, రాజ్యలక్ష్మీ ఉన్నారు.

గ్రామాల్లో అదనపు కలెక్టర్ రాహుల్ పర్యటన

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కోనూర్, వెంకటాపూర్, సోనాపూర్, తాటిగూడ గ్రామ పంచాయతీలలో అదనపు కలెక్టర్ రాహుల్ పర్యటించారు. ఈ సంధర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ముందుగా ఆయా పాఠశాలలో నులి పురుగుల నివారణ దినోత్సవం సంధర్భంగా మాత్రల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ కె నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు రాము, మానస, మౌనిక, దీప్తి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు కాడెడ్లు మృతి



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రానికి చెందిన భూపల్లి లచ్చయ్య, పల్ల శ్రీనివాస్‌కు చెందిన రెండు కాడెడ్లు విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గురువారం ఉదయం గుర్తించారు. గ్రామ పంచాయతీ శివారులో గల కొట్టాల ఏరియాలో గల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్లకు తాకిన రెండు కాడెడ్లు అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన పశువులు తిరిగి రాకపోవడంతో గాలిస్తున్న క్రమంలో గురువారం ఉదయం గ్రామ శివారులో గల కొట్టాల ఏరియా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైరుకు తాకి మృతి చెందినట్లు గుర్తించారు. మృతి చెందిన ఎడ్ల విలువ ఒక్కొక్క పశువు రూ. 70 వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. ఖరీఫ్ సాగు మొదలైన ప్రస్తుత పరిస్థితుల్లో కాడెడ్లు మృతి చెందడంతో ఆవేధన వ్యక్తం చేస్తున్నాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో మేత మేసుకుంటు వెళ్లిన పశువులు మృతి చెందాయని పేర్కొన్నారు.

పిల్లల మానసిక పరిపక్వతను అనుసరించి విద్యా బోధన చేయాలి



నవతెలంగాణ-తాండూర్

పిల్లల మానసిక పరిపక్వతను అనుసరించి విద్యాబోధన చేయాలని బెల్లంపల్లి సీడీపీఓ ఉమాదేవి అన్నారు. గురువారం బెల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలోని అగన్‌వాడీ టీచర్లకు సూపర్‌వైజర్ మూడు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల పెరుగుదల మానసిక అభివృద్ధి గురించి అంగన్‌వాడీ టీచర్లు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. చిన్నపిల్లల్లో మానసిక శారీరక ఎదుగుదలను తల్లిదండ్రులు గమనించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ఎదుగుతున్న పిల్లల్లో మాట తీరు చురుకుదనాన్ని పరిశీలిస్తుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, స్వరూప రాణి, జ్యోతి పాల్గొన్నారు.

భూగర్భ గనులలో పనితీరుపై వర్క్‌షాప్



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి గెస్ట్ హౌస్‌లోని సమావేశ మందిరంలో భూగర్భ గనులలో మ్యాన్ రైటింగ్ సిస్టం, ఫేస్ ఎక్విప్మెంట్, హాలర్స్ పనితీరుపై గురువారం ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి రీజియన్, ఆర్జీ రీజియస్ అధికారులకు డిఎంఎస్, (మెకానికల్)సుధీర్ సౌత్ సెంట్రల్ జోన్ హైదారాబాద్ గణపత్ రావు బల్సేర్ భూగర్భ గనులలో మ్యాన్ రైడింగ్ సిస్టం, ఫేస్ ఎక్విప్మెంట్, హాలర్స్ పనితీరుపై వర్క్ షాప్‌లో భాగంగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమములో దిలీప్ కుమార్ డీడీఎంఎస్(మెకానికల్), జీఎం రక్షణ కార్పొరేట్ కె గురువయ్య, మందమర్రి జీఎం మనోహర్, జీఎం ఏపీఏ కే వెంకటేశ్వర్లు, జీఎం రక్షణ బీపీఏ రీజియస్ కె.రఘు కుమార్, జీఎం రక్షణ పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో బస్టాప్ వద్ద పోలీసులు గుట్కాను పట్టుకున్నారు. నిర్మల్ జిల్లాకు చెందిన అత్తర్ అహ్మద్ ఫారూఖ్ అక్రమంగా గుట్కా తరలిస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు సుమారు రూ.6,260 విలువ గల గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. అత్తర్ అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్

తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంగమల్లయ్యపల్లిలో చోటుచేసుకుంది. సీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డి సాయిచరణ్(15) తొమ్మిదవ తరగతి పాసై పదవ తరగతి చదువుతున్నాడు. బుధవారం పదవ తరగతి పుస్తకాలు సైకిల్ పై తీసుకొని వస్తుండగా పుస్తకాలను ఎక్కడో పడేసుకొని వచ్చాడని, ఈ విషయం తండ్రి శ్రీనివాస్‌కు తెలుపగా మందలించాడు. తీవ్ర మనస్థాపానికి గురైన సాయి చరణ్ గురువారం ఉదయం శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఇంటి ముందర పనులలో నిమిఘనమై ఉండగా దేవుని రూమ్‌లో రేకుల షెడ్డుకు చున్నితో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాసేపటికి ఇంట్లో వెళ్లి చూడగా వేలాడుతున్న కుమారుడిని చూసి పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

19 ఏళ్ల లోపువారు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

- కలెక్టర్ రాజర్షి షా
- విద్యార్థులకు మాత్రలు వేసిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు నులిపురుగుల నివారణకు వేయడం జరుగుతుందని, తప్పనిసరిగా ఆహారం తీసుకున్న తర్వాత మాత్రలను వేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమంలో విద్యార్థినులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ అన్ని సబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కాలశాలలో మాత్రలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ తప్పిపోయిన వారికి 27న స్పెషల్ డ్రైవ్‌లో మాత్రలు వేసుకొనేల చూడాలన్నారు. ఒకటి నుండి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, రెండు నుండి మూడు సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర చెంచలో పొడిచేసి నీళ్లలో కలిపి వేయాలని సూచించారు. అల్బెండజోల్ మాత్ర ఆహారం తీసుకున్న తరువాతనే తీసుకోవాలని, మాత్ర ఇంటిదగ్గర వేసుకోవడానికి ఇవ్వకూడదన్నారు. జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాల పిల్లలు 2, 21, 141 మంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాధన, డీఐఈఓ రవీందర్ కుమార్, డీఈఓ ప్రణీత, జిల్లా ఇమ్యూనేషన్ అధికారి శ్రీనివాస్, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, సోషల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపల్, వైద్యాధికారులు, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

నిర్మల్ : 19 సంవత్సరాలలోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు (అల్బెండజోల్) వేయించాలని డీఎంహెచ్ఓ డా. ధన్‌రాజ్ అన్నారు. గురువారం సోఫీనగర్‌లోని గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలందరికీ నులిపురుగు నివారణ మాత్రలు అందించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని, భోజనానికి ముందు విద్యార్థులంతా తమ చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజేందర్, ప్రిన్సిపాల్ గంగాశంకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆదిలాబాద్‌టౌన్


నిర్మల్

ఉట్నూర్ : మండలంలోని లింగోజితాండ గ్రామపంచాయతీ పరిధిలోని లాల్ టేక్డి గురుకుల పాఠశాల, న్యూ నలందా పాఠశాలలో విద్యార్థులకు గురువారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలను అందించారు. ముందు జాగ్రతగా నులి పురుగుల నిర్మూలకు చర్యలు తీసుకుంటున్నామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు, నర్సులు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.


ఉట్నూర్

నార్నూర్ : నులి పురుగుల నిర్మూలనకు కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబు అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోనీ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్ దాస్, ప్రధానోపాధ్యాయులు రాథోడ్ చంద్రకళ, వైద్య సిబ్బంది శిలా, జంగు బాయి, చౌహన్ ఈశ్వర్, ఉపాధ్యాయులు చౌహన్ హరిచంద్, జాదవ్ శ్రీనివాస్ ఉన్నారు.

ఇంద్రవెల్లి : మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అర్క పుష్పలత విద్యార్థులకు మాత్రలు పంపిణీచేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, హెచ్ఎం రామ్మోహన్, హెచ్ఎస్ శ్రీనివాస్, సిబ్బంది, పద్మ, లక్ష్మీ జ్యోతి, ద్రుపద పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల మండలంలోని వాఘాపూర్, పిట్టలవాడ పాఠశాల విద్యార్థులకు గురువారం అల్బెండజల్ మాత్రలు వేయడం జరిగిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అన్నారు. కార్ర్యమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఇన్‌చార్జీ హెచ్ఎం నాగేందర్, డా.రోజా, రమణి, హెల్త్ సూపర్‌వైజర్లు మర్సకోల లక్ష్మి, సుభాష్, సీనియర్ ఉపాధ్యాయులు రమేష్ బాబు, గ్రామస్థులు మర్సకోల హన్మంతు రావ్, ఆత్రం శంకర్, సురేష్, ఈశ్వర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అంబయ్య, ఆశా కార్యకర్తలు త్రిషాల, గౌరబాయి, భూమన్న పాల్గొన్నారు.

లోకేశ్వరం : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యురాలు తేజస్విని అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కేజీబీవీ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందజేశారు. నులి పురుగులతో మనిషి ఎదుగుదల ఉండదని ఆరోగ్యంగా ఉండాలంటే విద్యార్థులు ఈ మాత్రలను వేసుకోవాలన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని రాజుర గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం గోదావరి, అంగన్‌వాడీ టీచర్ పి.పద్మ పిల్లలకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు శ్రీలత, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.


నార్నూర్


ఇంద్రవెల్లి


ఆదిలాబాద్‌రూరల్

బస్టాండ్‌లో రచ్చ చేసిన మహిళలు

- ఒకరిపై ఒకరు దాడి.. అడ్డుపడని అధికారులు

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం ఉదయం ఇద్దరు మహిళలు ఉన్నట్టుండి ఒక్కసారిగా గొడవకు దిగారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ బస్టాండ్ ప్రాంగణం అంత నాన హంగామా చేశారు. అధికారులు ఎవరు స్పందించక పోవడంతో ఇద్దరు ఒకరిపై ఒకరు తీవ్రంగా దాడి చేసుకున్నారు. అనంతరం తలో దిక్కుకు వెళ్లిపోయారు. అక్కడే ఉన్న ప్రయాణికులు మహిళలు కొట్లాడుతున్న సమయంలో ఫోన్ లలో వీడియోలు తీస్తూ చోద్యం చూశారు. తప్ప ఎవరు కూడా గొడవ సద్దు మణిగించే ప్రయత్నం చేయలేదు. ప్రయాణికులు తీసిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియా లోచక్కర్లు కొడుతుంది. అది చుసిన స్థానికులు గతంలోను మంచిర్యాల బస్టాండ్‌లో ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయని కొన్ని రోజుల క్రితం ఒక మహిళా, యువకుడు కలిసి బస్టాండ్ ఆవరణలో విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై దాడి చేయడంతో సదరు ఉద్యోగి తీవ్ర గాయాల పాలయ్యడని, జేబు దొంగలు, బిచ్చగాళ్లకు ఆర్టీసీ బస్టాండ్ నివాస స్థలంగా మారిందంటూ పలువురు చర్చించుకున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో రక్షణ కరువయ్యిందంటూ ఆరోపించారు.

తుంపల్లిలో మహిళపై దాడి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని తుంపెల్లి గ్రామంలో మహిళపై గ్రామానికి చెందిన ఇతర వ్యక్తులు దాడి చేశారు. బాధితురాలు పోలవేణి అంకు తెలిపిన వివరాల ప్రకారం ప్రతిరోజు లాగే తను ఉపాధి హామీ పనికి వెళ్లి వచ్చేసరికి తమ ఇంటి సరిహద్దు కోసం ఉంచిన తీగలతో కూడిన ఫెన్సింగ్ వైర్‌ను గ్రామానికి చెందిన పోలవేణి హనుమంతు తొలగించి కొత్తగా కట్టెలతో దడి పెట్టడంతో తమ సరిహద్దు లోపల ఇలా చేయడమేంటని ప్రశ్నించింది. దీంతో హనుమంతు అల్లుడు భామినే పర్వతాలతో కలిసి వచ్చి కర్రలతో దాడి చేశారని తెలిపారు. ఇదే సమయంలో అడ్డుపడడానికి వచ్చిన తన పెద్ద కుమారుడు బీరయ్యను కూడా కొట్టి గ్రామస్తుల ఎదుట తిట్టినట్లు వివరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపిన ఆమె తనకు న్యాయం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి రూ.8లక్షల చెక్కు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీస్ వ్యవస్థకు సేవలు అందిస్తూ విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. గురువారం పోలీసు కార్యాలయంలో ఈ సంవత్సరం మార్చి 8న మహాశివరాత్రి సందర్భంగా కుంటల జలపాతంలో విధులు నిర్వర్తిస్తుండగా గుండెపోటుతో హఠన్మరణం చెందిన నేరడిగొండ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మార్కండేయ కుటుంబ సభ్యులైన భార్య సుజాత, కొడుకు కె.నిఖిల్ భద్రతకు సంబంధించిన రూ.8లక్షల విలువైన చెక్కును ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎటువంటి సమస్యలకైనా జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలను అందిస్తుందని హామీ ఇచ్చారు. 24 గంటలు అవిశ్రాంతంగా విధులు నిర్వర్తించే పోలీసులు వారి ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం అనారోగ్య బారినపడకుండా ప్రతి సంవత్సరం మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందులో భాగంగానే బుధవారం జిల్లా పోలీసు యంత్రాంగానికి వారి కుటుంబ సభ్యులకు కేర్ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత పాల్గొన్నారు.

ఎస్పీఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు ఆధ్వర్యంలో గురువారం కాగజ్‌నగర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. జేకే గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపకుడు హరిశంకర్ సింఘానియా జన్మదినం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో 150 మందికి పైగా రక్తదానం చేశారు. మిల్లు వైస్ ప్రెసిడెంట్ ఎకె మిశ్రా, సీజీఎం సురేందర్ బియాని, జీఎం ఎంఎస్ గిరి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. గర్భిణీలకు ప్రసూతి సమయంలో రక్తం అవసరం చాలా ఉంటుందని, ఇటువంటి వారికి ఆపద సమయంలో మనం ఇచ్చే రక్తం చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నయీం అహ్మద్, మిల్లు ప్రతినిధులు గిరీష్ రాయ్, రమేష్ రావు, నాగరాజు, తుమ్మ రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సంఖ్య ఐఎఫ్ఎమ్ఎస్‌లో నమోదు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ అధికారులందరూ తమపరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులందరి ఆధార్ సంఖ్యను ఐఎఫ్ఎమ్ఎస్ పోర్టల్లో నమోదు చేయాలని జిల్లా కోశాధికారి జాడి రాజేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంతకు ముందే ఐఎఫ్ఎమ్ఎస్ పోర్టల్లో నమోదు చేసి ఉంటే వారి ఆధారసంఖ్యను ఆధార్ నిజప్రతితో సరిచూసుకోవాలన్నారు. జూన్ మాసం జీతం బిల్లుతో పాటు ఆధార్ సంఖ్య నమోదుకు సంబంధించిన సర్టిఫికెట్ జతచేయాలని, ఆ సర్టిఫికెట్ నమూనా సంబంధిత ఖజానా కార్యాలయాలలో లభిస్తుందని, జూన్ 25లోగా సంబంధిత డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ అధికారులు ఈ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పేర్కొన్నారు.